క్లుప్తంగా

1,075 క్వింటాళ్ల పప్పుశనగ కేటాయింపు



పప్పుశనగ నాణ్యతను పరిశీలిస్తున్న ఏడీఏ

గుత్తి: గుత్తి వ్యవసాయ డివిజన్‌కు సంబంధించిన రబీ సీజన్‌కు 1,075 క్వింటాళ్ల పప్పుశనగ కేటాయించామని ఏడీఏ వెంకటరాముడు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పవన్ అగ్రి ఎజెన్సీస్ ప్రాసెసింగ్ యూనిట్‌లో పప్పుశనగ నాణ్యతను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన పప్పుశనగను సరఫరా చేయాలని ఆదేశించారు. జేజీ–11 రకం పప్పుశనగ కింటా పూర్తి ధర రూ. 8100 కాగా రైతులకు 40 శాతం సబ్సిడీ అంటే కింటా రూ.4860కు అందిస్తామన్నారు. ఖరీఫ్‌లో పంటలు సాగు చేసుకున్న రైతులు ఆర్‌బీకేల్లో ఈ పంట నమోదుతో పాటు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించండి



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రాజామణి

యల్లనూరు: పౌష్టికాహారన్ని సక్రమంగా అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజామణి సిబ్బందికి సూచించారు. శుక్రవారం స్థానిక అంగన్‌వాడీ సెంటర్ 1లో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ నెలవారీ నివేదికలపై చర్చించారు. అనంతరం సిబ్బందికి యూనిఫాం అందజేశారు.

రైల్వే ఓవర్‌బ్రిడ్జిల ఏర్పాటుపై గ్రామసభ



గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

యాడికి: రాయలచెరువు పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచు తలారి అరుణ అధ్యక్షతన రైల్వే ఓవర్‌బ్రిడ్జిల ఏర్పాటుపై గ్రామసభ జరిగింది. ఈసందర్భంగా తహసీల్దార్ అలెగ్జాండర్ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న రెండు రైల్వేగేట్ల(చందన, యాడికి రైల్వే గేట్) స్థానంలో రైల్వే అధికారులు రైల్వే ఓవర్ బ్రిడ్జిలు నిర్మిస్తున్నారన్నారు. త్వరలో రైల్వే ఉన్నతాధికారులు వచ్చి పరిశీలిస్తారని చెప్పారు. వైస్ ఎంపీపీలు జే హసీనాభేగం, చెన్నప్ప, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కుమార్, వీఆర్వో కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు నగేష్, రషీద్, రవికాంత్ చౌదరి, శివయ్య, హనుమంత రెడ్డి, ఉపేంద్రగౌడ్ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

తాడిపత్రి అర్బన్: పురిట్లోనే శిశువు మరణించడంతో మనస్థాపానికి గురైన ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ తెలిపిన వివరాలలు.. సీపీఐ కాలనీకి చెందిన రాగే జ్యోతి(25), హరికృష్ణ మూడేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి రెండేళ్ల చిన్నారి ఉంది. ఇటీవల అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో రాగే జ్యోతి మరో మగ శిశువుకు జన్మనిచ్చింది. అయితే పురిట్లోనే శిశువు మృతి చెందింది. తీవ్ర మనస్థాపానికి గురైన ఆమె శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుంది. మృతురాలి తండ్రి రాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

సుంకం వసూలుకు వేలం

పామిడి: స్థానిక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఈఓఆర్డీ బీవీ శశికళ ఆధ్వర్యంలో సుంకం వసూలుకు వేలం నిర్వహించారు. మధుసూదన్‌రెడ్డి అనేవ్యక్తి బస్టాండ్ సుంకం వసూలును రూ.1.73 లక్షలు, దినసరి మార్కెట్ రూ.1.43 లక్షలకు దక్కించుకున్నట్లు ఈఓ చంద్రశేఖర్ తెలిపారు.

నేర నియంత్రణకు చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న జీఆర్‌పీ ఎస్పీ

గుంతకల్లు: నేర నియంత్రణకు కృషి చేస్తున్నట్లు గుంతకల్లు రైల్వే జిల్లా జీఆర్‌పీ ఎస్పీ చౌడేశ్వరి పేర్కొన్నారు. శుక్రవారం గుంతకల్ రైల్వే జీఆర్‌పీ జిల్లా పరిధిలోని కర్ణాటకలోని రాయచూర్ జీఆర్‌పీ పోలీసులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ రైలు ప్రయాణికుల భద్రత, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై సమీక్షించారు. సమస్యాత్మక రైలు మార్గాలు, రైల్వేస్టేషన్లపై ఎప్పటికప్పుడు సిబ్బందిని అప్రమత్తంగా ఉంచాలన్నారు. రాయచూర్ జీఆర్‌పీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులు, వాటి పురోగతి తదితర అంశాలపై చర్చించారు. గుంతకల్లు జీఆర్‌పీ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, ఐపీఎఫ్ మహేంద్ర పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



వృద్ధురాలికి సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. శుక్రవారం రెండో రోజు భగత్ సింగ్ నగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి నాలుగున్నరేళ్లలో ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. అర్హులకు సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా నేరుగా ఇళ్ల వద్దకే పథకాలు, సేవలు అందిస్తున్నారన్నారు. పథకాలకు సంబంధించిన మొత్తాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేస్తున్నారని గుర్తు చేశారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు సిఫారసు చేసిన వారికి మాత్రమే పథకాలు అందేవన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ జగనన్నను సీఎం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మారపురెడ్డి రంగనాథ్‌రెడ్డి, ఆకుల చిన్ననాగిరెడ్డి, రాబర్ట్, వైఎస్సార్‌సీపీ నాయకులు మనోజ్, హరినాథ్‌రెడ్డి, సూర్యప్రభాకర్‌బాబు, రామకృష్ణ, డీవీ కుమార్, పేరం ప్రతాప్ మున్సిపల్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించండి

తాడిపత్రి అర్బన్: మున్సిపల్ స్థలంలో కట్టడాలు చేపట్టిన వారికి నోటీసులు ఇచ్చి ఆక్రమణలు తొలగించాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మున్సిపల్ కమిషనర్ జి.రవిని ఆదేశించారు. యల్లనూరు రోడ్డు చివరలో ప్రైవేటు వ్యక్తులు మున్సిపల్ డ్రైనేజీపై చేపట్టిన కట్టడాలను శుక్రవారం ఎమ్మెల్యే మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఒపెన్ డ్రైనేజీలపై కట్టడాలను వెంటనే తొలగించాలని అధికారులకు సూచించారు.

నేడు ‘జగనన్న ఆరోగ్య సురక్ష’ శిబిరం

గుంతకల్లుటౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం తిలక్‌నగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్‌సెంటర్‌లో మెగా ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. శిబిరం నిర్వహణపై శుక్రవారం కమిషనర్ వైద్య, మున్సిపల్ శాఖ అధికారులు, వార్డు కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. స్త్రీలు, చిన్నపిల్లలు, జనరల్ మెడిసిన్ తదితర స్పెషలిస్ట్ వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేస్తారని కమిషనర్ తెలిపారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వాతి, ఆర్ఓ నాసిర్‌హుసేన్, కౌన్సిలర్ సుమోబాషా తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యల్లనూరు, తిమ్మంపల్లి వైద్యులు లోకేష్, కీర్తన శుక్రవారం కోరారు. వైద్యులు మాట్లాడుతూ వైద్య బృందం ఇంటింటికీ వచ్చి పరీక్షలు చేస్తారన్నారు.

యాడికి: మండలంలో ఈ నెల 30 నుంచి వచ్చే నెల 20 వరకు అన్ని పంచాయతీల్లోని గ్రామ సచివాలయాల వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ శుక్రవారం తెలిపారు. శిబిరాల నిర్వహణకు రెండు బృందాలు నియమించామన్నారు. ప్రజలు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పుట్లూరు: తక్కళ్లపల్లిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు. ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

గార్లదిన్నె: శిరివరంలో శనివారం నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హాజరవుతున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి తెలిపారు. ప్రజలు పాల్గొనాలని కోరారు.

శింగనమల: మండల కేంద్రంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ ఫిర్దోస్ శుక్రవారం తెలిపారు. ఆరోగ్య సమస్యలున్న వారు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బుక్కరాయసముద్రం: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఎంపీడీఓ తేజోత్స్న తెలిపారు. శుక్రవారం రెడ్డిపల్లి పంచాయతీలోని రేకులకుంట గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. చికిత్స కోసం వచ్చేవారు టోకన్లతో పాటు ఆరోగ్య శ్రీ కార్డు, ఆధార్ కార్డు వెంట తీసుకుని రావాలన్నారు. కార్యక్రమంలో కొర్రపాడు పీహెచ్‌సీ డాక్టర్ శ్రీహర్ష, సర్పంచ్ నరసమ్మ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి: గన్నెవారిపల్లి కాలనీలోని ఎంఈఓ కార్యాలయ ఆవరణలో శనివారం ఉదయం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రంగారావు శుక్రవారం తెలిపారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రారంభిస్తారన్నారు.

వాడీవేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లు: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం వాడీవేడిగా జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధికారులు తొలుత అజెండా అంశాలను చదివి వినిపించారు. పట్టణంలోని ట్రావెల్స్ బంగ్లా వద్ద షెడ్ల ఏర్పాటుపై వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్ మధ్య చర్చ జరిగింది. టీడీపీ కౌన్సిలర్ ఆర్.పవన్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ట్రావెల్స్ బంగ్లా వద్ద దాదాపు 60 అడుగుల రోడ్డు నిర్మించారని, రోడ్డు ఆక్రమిస్తూ అధికార పార్టీ నాయకులు డబ్బు తీసుకొని షెడ్లు నిర్మిస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ చాంద్‌బాషా, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఫ్లయింగ్ మాబు మాట్లాడుతూ 30 ఏళ్లుగా పైగా పొట్టకూటి కోసం చిన్నచిన్న బంకులు ఏర్పాటు చేసుకొని జీవనం సాగించే పలువురు రోడ్డు వెడల్పుతో ఉపాధి కోల్పోయారన్నారు. మున్సిపాలిటీ నిర్మించిన 60 అడుగుల రోడ్డుకు అవతల ట్రావెల్స్ బంగ్లా గోడకు అనుకొని చిరువ్యాపారులు సొంతంగా షెడ్లు ఏర్పాటు చేసుకుంటున్నారన్నారు. పేద ప్రజలు బతకడం టీడీపీ కౌన్సిలర్లకు ఇష్టం లేదని విమర్శించారు.

ఖాళీ స్థలంలో పేరుకుపోయిన ముళ్లపొదలను తొలగించండి..

ఇళ్ల మధ్యలోని ఖాళీ స్థలాల్లో ముళ్లపొదలు పెరిగిపోవడంతో పాములు, ఇతరత్ర విషకీటకాలు ఇళ్లలోకి వస్తున్నాయని, వాటిని తొలగించాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లోని మున్సిపల్ స్థలాలు కబ్జాకు గురువుతున్నాయని మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఫ్లయింగ్ మబూ ఆవేదన వ్యక్తం చేశాడు. దొనిముక్కల రోడ్డులోని ఇందిరమ్మ లే అవుట్–1లో కసాపురం ఆలయ సీఎస్ఓ కృష్ణారెడ్డి మున్సిపల్ స్థలాన్ని కబ్జా చేశాడన్నారు. మహేంద్ర కల్యాణమండం వెనుక వైపు గల పురాతన బావిస్థలాన్ని కబ్జాదారులను నుంచి కాపాడాలని కోరారు. మున్సిపల్ స్థలాలను కాపాడతామని కమిషనర్ మల్లికార్జున తెలిపారు. సత్యానారయణపేటలోని హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి పరచాలని కౌన్సిల్ సభ్యులు మోహరున్నీసాబేగం, ఉడిదాల ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. కౌన్సిలర్లు రవీంద్ర. వై.సుధాకర్, ఎనుమల భాస్కర్, కేవీ నాగరత్న వార్డుల్లో ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రస్తావించగా పరిష్కరిస్తామని చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు.

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు



ప్రజలతో సమస్యలు తెలుసుకుంటున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

పెద్దపప్పూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాయని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నరసాపురంలో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి ప్రజల సమ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కేవలం రాజకీయ పలుకుడి ఉన్న వారికి మాత్రమే సంక్షేమపథకాలు వర్తించేవన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు వర్తించేలా జగనన్న సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వేమనాథ రెడ్డి, ఎంపీపీ వెంకటరామిరెడ్డి (రామయ్య) మాజీ ఎంపీపీ రామ్మూర్తిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా పార్లమెంట్ జనరల్ సెక్రటరీ రవిప్రసాద్ రెడ్డి, వైస్ ఎంపీపీ పప్పక కళావతి, కోఆప్షన్ సభ్యుడు హాజీవలి, స్థానిక నేతలు రామాంజులరెడ్డి, రామచంద్ర (కాశీ) తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



తాగునీటి సమస్యను ప్రస్తావిస్తున్న కౌన్సిలర్లు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కౌన్సిలర్లు అధికారులను కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ అధ్యక్షతన సమావేశం జరిగింది. ముందుగా మున్సిపల్ వైస్ చైర్ పర్సన్లు వరలక్ష్మి, పద్మలత, కౌన్సిలర్లు బుసా రూపావతి, రాజేశ్వరి, నజీర్, ఫరూక్, అరవింద్ బాబు, వాల్మీకి శివ, కేవీ రమణ, వరదరాజులు, నరేష్ తదితరులు తాగునీటి సమస్య తీవ్రతను వివరించారు. ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తుండటంతో చాలాచోట్ల గొడవలు జరుగుతున్నాయని, కొళాయిలకు నీరు విడుదల చేయాలని కోరారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చడంతోపాటు సీసీరోడ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. త్వరలో తాగునీటి సమస్య పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్, డీఈ రఘు హామీ ఇచ్చారు. ఇన్‌చార్జ్ కమిషనర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

గుత్తి రూరల్: ఎస్‌జీఎఫ్ పోటీల్లో గురుకుల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. అనంతపురంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో రజాపురం గ్రామ సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు అపర్ణ (బాస్కెట్ బాల్), మౌనిక (షటిల్), తేజేశ్వరి (కబడ్డీ), జి.ఐశ్వర్య(ఖోఖో), వసంత, అపరంజి (హ్యాండ్ బాల్) రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఉషారాణి తెలిపారు. ఈసందర్భంగా వారిని ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ సుజాత, పీడీ, పూజిత అభినందించారు.

యువత దేశ నిర్మాణంలో భాగం కావాలి



కొప్పలకొండ ప్రాథమిక పాఠశాలలో మట్టిని అందిస్తున్న ఎంపీపీ వెంకటనారాయణ

గార్లదిన్నె: యవత దేశ నిర్మాణంలో భాగం కావాలని ఎంపీపీ వెంకటనారాయణ, సర్పంచు రామలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం కొప్పలకొండ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు నాభూమి– నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి గ్రామంలో ఇంటింటా మట్టి సేకరణ చేపట్టారు. మట్టిని అమరవీరుల స్మారకార్థం అమృత వాటిక నిర్మాణానికి వినియోగిస్తారన్నారు. పాఠశాల హెచ్‌ఎం గోవిందరెడ్డి, ఉపాధ్యాయులు పరమేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు: నాభూమి– నా దేశంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించడంతో పాటు కలశాల్లో మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల చిత్ర పటాలను పట్టుకుని స్థానిక బస్టాండ్ సర్కిల్‌లో మానవ హారం నిర్వహించారు. అనంతరం ఎంఈఓ శ్రీదేవి, హెచ్‌ఎం విజయలక్ష్మి నాభూమి– నా దేశం కార్యక్రమ ప్రాముఖ్యతను వివరించారు.

పెద్దవడుగూరు: యువత దేశ రక్షణ కోసం కృషి చేయాలని ఎంఈఓ రాముడు, జెడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు హరినాథ్, మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం లక్ష్మంపల్లి, చిత్రచేడు జెడ్పీ పాఠశాలల్లో నా భూమి– నాదేశం కార్యక్రమంలో భాగంగా దేశ నాయకుల చిత్రపటాలతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని మట్టిని సేకరించి ఎంఈఓకు అందజేశారు.

‘స్వచ్ఛతా హీ సేవ’ నిర్వహించండి



సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈఎల్ఎస్ఆర్ ట్యాంకుల ఆవరణల్లో అక్టోబర్ 1,2 తేదీల్లో శ్రమదానం నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఇంజినీరింగ్, నాన్ పీహెచ్ వర్కర్లకు సూచించారు. శుక్రవారం ఉదయం ఆయన నాన్ పీహెచ్ వర్కర్స్ మస్టర్‌కు పరిశీలించారు. కార్మికులు సమయపాలన పాటించాలని సూచించారు. ఈఎల్ఎస్ఆర్ ట్యాంకుల ఆవరణల్లో చెత్తాచెదారం, పిచ్చిమొక్కల తొలగింపు కార్యక్రమాలు చేపట్టాలన్నారు. డీఈ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పామిడి: ఖాదర్‌పేట గ్రామంలో శుక్రవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు వీధుల్లో పరిశుభ్రతపై ర్యాలీ చేపట్టారు. రచ్చకట్ట వద్ద మానవహారంగా ఏర్పడి పరిశుభ్రత మనందరి బాధ్యత అంటూ నినదించారు. ఈసందర్భంగా జిల్లా సమన్వయకర్త సునిత, ఈఓఆర్డీ బీవీ శశికళ మాట్లాడుతూ ప్రతి ఇక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. సర్పంచ్ సుశీలమ్మ, మండల సమన్వయకర్త ఎం రవీంద్ర, పంచాయతీ కార్యదర్శులు షెక్షావలి, మునీంద్ర, సచివాలయ కార్యదర్శి శర్మ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ ఇంజినీరింగ్ డిప్లొమాలో స్పాట్ అడ్మిషన్లు

తాడిపత్రి: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అక్టోబర్ 3న సివిల్ ఇంజినీరింగ్ డిప్లమా, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ డిప్లమా కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ శుక్రవారం తెలిపారు. పదవ తరగతి పాసైన విద్యార్థులు పాలీసెట్ రాయకున్నా అర్హులేనన్నారు. టెన్త్ మార్క్స్ మెమో, టీసీ, కుల ధ్రువీకరణ పత్రం, 4 వ తరగతి నుంచి పదవ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు తీసుకుని వచ్చే నెల 3 న కళాశాలలో హాజరుకాగలరని కోరారు. సీటు సంపాదించే విద్యార్థులు వెంటనే రూ.4,700, కౌన్సెలింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక



తైక్వాండో పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

గుత్తి: పట్టణంలోని కేజీబీవీకి చెందిన ఏడుగురు ఇంటర్ విద్యార్థినులు రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు ఎస్ఓ రుద్రాక్షి, పీఈటీ కళ్యాణి శుక్రవారం తెలిపారు. రాష్ట్రస్థాయి తైక్వాండో అండర్ –19 పోటీలకు నేత్ర, కుసుమ, గౌతమి, రజిత, మౌనిక, అమృత, భువనేశ్వరి ఎంపికయ్యారన్నారు. అండర్ –17 చెస్ విభాగంలో హసిని జిల్లా స్థాయి లో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఈసందర్భంగా కే రాష్ట, జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎస్ఓ, పీఈటీతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బుక్కరాయసముద్రం: గోవిందపల్లిలో వైఎస్సార్‌సీపీ నేత విజయమోహన్‌రెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పరామర్శించారు. ఇటీవల విజయ్‌మోహన్‌రెడ్డి తమ్ముడు శంకర్‌రెడ్డి కొట్టాలపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆలూరు సాంబశివారెడ్డి ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విజయ్ మోహన్‌రెడ్డి కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అంకే నరేష్, ఎంపీటీ ఎర్రినాగప్ప, కాశీ విశ్వనాథ్‌రెడ్డి, రాజు, వెంకటరామిరెడ్డి, ఈశ్వర రెడ్డి, దివాకర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, నాగలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. నారాయణుడి కల్యాణం



ఉత్సవమూర్తులను పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

పెద్దపప్పూరు: మహాలయ పౌర్ణమి సందర్భంగా ప్రసిద్ధిగాంచిన అశ్వత్థ నారాయణ స్వామి క్షేత్రంలో శుక్రవారం స్వామి కల్యాణం కమనీయంగా సాగింది. ముందుగా అర్చకస్వాములు సుధీర్‌కుమార్ శర్మ, బాలసుబ్రమణ్యశర్మ, సునీల్ కుమార్ శర్మ స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నారాయణస్వామి, శ్రీదేవి, భూదేవిని పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. ఉత్సవమూర్తులను పల్లకీలో ఊరేగించారు. వేడుకను తిలకించడానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

తాగునీటి ట్యాంకులు ప్రారంభం

యాడికి: చింతలాయపల్లెలో రూ.3 లక్షల మండల గ్రాంటుతో ఏర్పాటు చేసిన 3 మినీ తాగునీటి ట్యాంకులను శుక్రవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బొంబాయి రమేష్‌నాయుడు మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దృష్టికి పలువురు గ్రామస్తులు నీటి సమస్య తీసుకుపోవడంతో స్పందించిన ఎమ్మెల్యే నీటి టాంకులు ఏర్పాటు చేయించారన్నారు. ఎంపీటీసీ సభ్యులు అవుకు నాగరాజు, రామ్మోహన్, వైఎస్సార్‌సీపీ నాయకులు బీసీ మల్లికార్జున, మధుసూదన్‌రెడ్డి, దేవేందర్ రెడ్డి, గంగరాజు, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

పనిముట్ల అందజేత

గుత్తి: మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్ బీ, వైస్ చైర్ పర్సన్లు వరలక్ష్మి, పద్మలత, కౌన్సిలర్లు మున్సిపల్ వర్కర్లకు సేఫ్టీ పనిముట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య, శానిటరీ మేస్త్రీ శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

బలవంతపు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు

యాడికి: ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి బలవంతపు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి హిజ్రాలను హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో దాదాపు 50 మంది హిజ్రాలు కలిసికట్టుగా వచ్చి ఇళ్లు, కిరాణాషాపులు, హోటళ్ల యజమానుల వద్ద రూ.100 నుంచి రూ.500 వరకు వసూలు చేస్తున్నారు. దీంతో కోమటిబజార్‌లో కిరాణా షాపులను మూసివేశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ బస్టాండు వద్దకు చేరుకొని హిజ్రాలకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

ముగ్గురికి తీవ్ర గాయాలు

గుత్తి రూరల్: రజాపురం శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి బైక్ అదుపు తప్పి బోల్తా పడి ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. వైఎస్సార్ కడప జిల్లా సింహాద్రిపురానికి చెందిన రాజేష్, వంశీ, జశ్వంత్ కసాపురం నెట్టికంటి అంజనేయ స్వామి దర్శనానికి బైక్‌పై బయలుదేరారు. అయితే రజాపురం గ్రామ శివారులో వేగంగా వెళ్తున్న వారి బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన వారిని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం అనంతపురం తీసుకెళ్లారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పెద్దవడుగూరు : మేడిమాకులపల్లిలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. వివరాలు... గ్రామానికి చెందిన మాధవరెడ్డి సోదరుడు రాజశేఖర్‌రెడ్డి ఇటీవల అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. అదే అప్పులు తనను వెంటాడుతుండటంతో ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్థాపనకు లోనైన మాధవరెడ్డి శుక్రవారం ఇంట్లో పురుగుల మందు తాగాడు. అపస్మారకస్థితిలో ఉన్న అతనిని పామిడికి తరలించారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం



చెక్కు అందిస్తున్న కమాండెంట్ గంగాధర్ రావు

బుక్కరాయసముద్రం: అనారోగ్యంతో మృతి చెందిన ఏపీఎస్పీ 14వ బెటాలియన్ కానిస్టేబుల్ నాగరాజు భార్య రాధకు బెటాలియన్ కమాండెంట్ గంగాధర్ రావు శుక్రవారం రూ.25 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుల సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. కారుణ్య నియామకం కింద నాగరాజు భార్య రాధకు ఉద్యోగం వచ్చేటట్లు కృషి చేస్తామన్నారు. అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, ఏఏఓ విజయ్‌కుమార్ నాయుడు, బెటాలియన్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక

పుట్లూరు: ఆదర్శ పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ పవన్‌కుమార్ శుక్రవారం తెలిపారు. జిల్లా స్థాయి అండర్–19 ఖోఖో, టెన్నికాయిట్‌లో వై.ఎస్తేరు, త్రోబాల్ విభాగంలో టి.నవ్య రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. హెచ్‌ఎం ఆస్మాసయోద విద్యార్థులను అభినందించారు.

40 శాతం సబ్సిడీతో పప్పుశనగ

గుంతకల్లు రూరల్: రబీ కింద ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో పప్పుశనగ పంపిణీ చేయనున్నట్లు ఏఓ స్వాతి సూచించారు. రైతులు ఆర్బీకేల్లో పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్, మొబైల్ ఫోన్ తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం 20 కిలోల పప్పుశనగను రూ.972కు అందజేస్తుందన్నారు.

నేడు ‘గడప గడపకూ మన ప్రభుత్వం’

గార్లదిన్నె: ఎం.కొత్తూరులో శనివారం ఉదయం 7 గంటలకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి పేర్కొన్నారు. ఎం.కొత్తపల్లి, ముంటిమడుగు, శిరివరం, గుడ్డాలపల్లి, రామదాస్‌పేట, అంకంపేటలో కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.